డాక్టర్ వేదాల రంగనాథం, కృష్ణకుమారి

టెర్రాహట్, ఇండియానా




## కృష్ణకుమారి



నాన్నగారు(అయ్యగారు)వింజమూరి తిరువెంగళాచార్యులుగారు కృష్ణాజిల్లాల్లోని తాడంకి హైస్కూల్లో హెడ్మాస్టారుగా పనిచేసి, రిటైరయ్యాక, 1960 ప్రాంతాల్లో పశ్చిమ గోదావరి జిల్లాలోని నర్సాపూరు వచ్చి సెటిలయ్యారు. మా నాన్నగారి సంతానం మొత్తం పది మందిలో నేను ఎన్మిదో సంతానం, ఐదవ అమ్మాయిని. నాకు నలుగురు అక్కయ్యలు ముగ్గురు అన్నయ్యలు,ఒక చెల్లి, ఒక తమ్ముడు.. 6వ తరగతి వరకూ తాడంకిలోనే చదువుకున్న నేను, తరువాత నర్సాపూర్ లో హైస్కూలు చదువు కొనసాగించాను... నాకు పెళ్ళి సంబంధాలు రావడం విచిత్రంగా జరిగింది. విచిత్రం అనే కంటే అనుకోకుండా అంటే సమంజసంగా వుంటుందేమో..!

పెద్దక్కయ్యలు ముగ్గురికీ, అన్నయ్యలు ముగ్గురికీ, పెళ్ళిళ్ళయ్యాక నాలుగో అక్కయ్య శాంతకుమారికి నాన్నగారు సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. నేను మామూలుగానే స్కూలుకి వెళ్ళి వస్తున్నాను. అక్కయ్యకి వచ్చిన సంబంధాలు వరుసగా తప్పిపోవడం మొదలైంది. నాకు ముందులో పెద్దగా తెలీలేదు కానీ, తరువాత తెలిసింది..అక్కయ్యని చూడడానికి వచ్చిన వాళ్ళు నన్ను చూసి, నన్నైతేనే చేసుకుంటామన్నారట. నాన్నగారికి ఇది నచ్చలేదు. పైగా అక్కయ్యకి పెళ్ళి కాకుండా నాకు పెళ్ళిచేసే ఆలోచనేలేదు, నాన్నగారికి. ఒక పెళ్ళి కొడుకుతో ఐతే చాలా సీరియస్ చర్చలు జరిగి చివరికి అతగాడిని ‘నువ్వు నాకాళ్ళ మీదపడినా సరే క్రిష్ణమ్మ(నన్నలాపిలిచేవారు)ని ఇచ్చి పెళ్ళి చేసే ప్రసక్తే లేదు..” అని చెప్పాల్సి వచ్చిందంట.!

1963 లో నేను పి.యు.సి చదివే రోజులు..

అప్పటికే అన్నయ్య శ్రీనివాసాచారి వరంగల్ జిల్లా కలెక్టర్గా పనిచేస్తుండే వాడు. మా వూరికే చెందిన ఒకాయన హైదరాబాదులో హౌస్సర్జన్ గా పనిచేస్తున్నారు. ఆయన పెళ్ళి సంబంధంకోసం చూస్తున్నారని తెలిసి , మా అన్నయ్య వరంగల్ రప్పించి అక్కయ్యని చూపించారు. ఐతే అక్కయ్యని చూశాక సమాధానమేమీ చెప్పకుండా వెళ్ళి పోయారట - ఆయన. నేను ఉండడం వల్ల అక్కయ్యకి సంబధాలు కుదరడం లేదని వరంగల్ పెళ్ళి చూపులు ఏర్పాటు చేసినా ఉపయోగం లేదని మావాళ్ళు కొంచెం బాధపడ్డారు. ఆ హౌస్ సర్జన్ చేస్తున్న వ్యక్తే రంగనాథం గారు. రంగనాథం గారి అన్నయ్య గారు నర్సాపూర్లోని మిషన్ హైస్కూల్లో హెడ్మాస్టారుగా పనిచేసేప్పుడు అందులోనే చదువుకుంటున్న నన్ను చూశారట.. ఓ రోజు రంగనాథంగారి నాన్న గారు మా ఇంటికి వచ్చి నన్ను వాళ్ళబ్బాయికి చేసుకోవాలని ఉందని చెప్పారు. వీళ్ళు అక్కయ్యని చూసి వద్దన్న వాళ్ళేనని తెలిసినా, పెళ్ళికొడుకు డాక్టర్ అవడమూ, నన్ను చిన్నప్పటినుంచీ డాక్టర్

కిచ్చి పెళ్ళిచేయాలని అనుకోవడం వల్లా, నాన్న గారు ఈ సంబంధానికి మొగ్గుచూపారు.



అమ్మా నాన్నలతో

ఆ విధంగా రంగనాథంగారు నన్ను అక్టోబర్ 1963 లో పెళ్ళి చూపులు చూశారు. అప్పటికి నావయసు పదహారేళ్ళే.. మా రెండో అన్నయ్య, రామానుజం, రంగనాథం గారిని చూసి 'పెళ్ళి కొడుకు కొంచెం పొట్టిగా వున్నాడే.' అన్నారు. మా కాబోయే మామ గారేమో ' పెళ్ళి అయ్యాక కూడా, మా అబ్బాయి పై చదువులు పూర్తి అయ్యే వరకూ, దాదాపు



తాళికట్టు శుభవేళ

నాలుగేళ్ళ పాటు మీ ఇంట్లోనే ఉంటుంది' అని అన్నారు. ఐనా డాక్టర్ సంబంధం కాబట్టి నాన్నగారు అన్నిటికీ ఒప్పుకున్నారు. ఐతే ఇంకా అక్కయ్యకి సంబంధాలు కుదరలేదు కాబట్టి, పెద్దమ్మాయికి పెళ్ళి కాకుండా చిన్నవాళ్ళకి చేయడం సంప్రదాయం కాదు కాబట్టి, నా పెళ్ళి మరో 6, 7 నెలల్లో చేద్దామని అనుకున్నారు.

ఈ లోగా మా కలెక్టర్ అన్నయ్య వరంగల్ నుంచీ గుంటూరు కి ట్రాన్స్ఫర్ అయ్యారు. రంగనాథం గారు హౌస్ సర్జెన్సీ ముగించుకుని తిరుపతిలో ఉద్యోగానికి వెళ్ళారు. నేను నర్సపూర్ లో పి.యు.సి. కొనసాగిస్తున్నాను.

అన్నయ్య చేసిన ప్రయత్నాలు ఫలించి అక్కయ్యకి కూడా త్వరలోనే బి.టెక్ చదివిన యువకుడితో సంబధం కుదిరింది. వారిది గుంటూరే. మొత్తానికి ముందు అనుకున్నట్లు 6,7 నెలలు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా మూడు, నాలుగు నెలల్లోనే 1964 ఫిబ్రవరి 6 న అక్కయ్యకీ, ఫిబ్రవరి 22 న నాకూ పెళ్ళి ముహూర్తాలు నిశ్చయమయ్యాయి.

ఇంతవరకూ జరిగిన సంఘటనలన్నీ ఒక ఎత్తు, ఈ రెండు నెలల్లో జరిగిన సంఘటనలు మరొక ఎత్తు.!

అక్కడ అక్కయ్య అత్తవారు గుంటురు లోనూ, మా వాళ్ళు నర్సపూర్ లోనూ పెళ్ళి ఏర్పాట్లలో మునిగిపోయి వున్నారు. వడియాలు పెట్టడం, అప్పడాలు ఒత్తడం, పిండి దంచడం, కారం కొట్టడం, అరిసెలు, లడ్లు ..పిండి వంటలు చేయడం, పెళ్ళి బట్టల షాపింగూ, నగలు చేయించడం..వగైరా పనులన్నీ మాంచి జోరుగా సాగుతున్నాయి.. అక్కయ్య పెళ్ళి సరిగ్గా రెండు వారాలుందనగా ఒక సంఘటన జరిగింది. అదేమిటంటే మాకు ఆకాశరామన్న ఉత్తరం ఒకటి వచ్చింది. అందులో సారాంశం ఏమిటంటే, మా అక్కయ్యకి కాబోయే బావగారు మంచివారు కాదనీ ఆ సంబంధం చేసుకోవద్దనీ...ఇలా ఏవేవో రాశారు. ఏదో అకతాయి ఉత్తరంలే అని నాన్నగారు ముందు పెద్దగా దాన్ని పట్టించుకోలేదు.. ఐతే వరుసగా నాలుగైదు రోజులు అలాంటి ఉత్తరాలే వచ్చేసరికి కొంచెం సీరియస్ అనిపించి గుంటూరులో ఉన్న కలెక్టర్ అన్నయ్యకి తెలియ చేశారు. అన్నయ్య వెంటనే స్థానికంగా వున్న పోలీస్ అధికారుల్తో మాట్లాడి, కాబోయే పెళ్ళికొడుకుని ఆ-ఫీసునుంచీ ఇంటికీ, ఇంటినుంచీ ఆఫీసుకీ తెలీకుండా ఫాలో

అయ్యి, ఇం కా కొంతమంది నీ విచారించి ఆ ఆకాశరామన్న ఉత్తరం లో ఏ మాత్రం నిజం లేదని నిర్ధారించుకున్నారు. ఇంతలో అవతలి నుంచీ కాబోయే బావగారి ని సంప్రదిస్తే వాళ్ళకి కూడా ఇలాంటిదే(అక్కయ్యగురించి) ఆకాశరామన్న వుత్తరం వచ్చిందని తెలిసింది. ఇద్దరూ తెలుసుకున్నాక ఎవరో ఆకతాయిలు చేసిన పని అని నిర్ధారించుకుని, వాటిని చించి వేసి పెళ్ళి పనుల్లో మునిగిపోయారు.. అక్కయ్యపెళ్ళి అనుకున్నట్లే ఫిబ్రవరి 6 , 1964 న వైభవంగా జరిగింది..

నా పెళ్ళికి మరో రెండు వారాల గడువుంది. ఇంట్లో అందరూ నా పెళ్ళి ఏర్పాట్లలో ఉండగా మళ్ళీ అలాంటి ఉత్తరాలే , రంగనాథం గారి గురించి. అప్పటికే ఇలాంటివి అందుకుని అవన్నీ పట్టించుకోవాలిసినవి కాదని నిర్ణయించుకున్నాం కాబట్టి ఎవరూ వాటిని ఖాతరు చెయ్యలేదు ఐతే వరుసగా మూడు రోజుల్లో మూడు ఉత్తరాలువచ్చాయి.. అవన్నీ ఆర్.ఎం.ఎస్ ( రైల్వే మెయిల్ సర్వీస్) లో పోస్ట్ చెయ్యబడి వున్నాయి కాబట్టి ఎక్కడినుంచీ వచ్చాయో కూడా తెలీ లేదు. ఐతే మేము లెక్క చేయక పోయినా రంగనాథం గారికీ ఇలాంటి లెటర్సే వచ్చాయి కాబట్టి మా కాబోయే మామగారు వాటిని తీసుకుని సరాసరి మాఇంటికి వచ్చారు. అంతకు ముందు మా అక్కయ్య విషయంలో ఇలానే జరిగిన సంఘటనలన్నీ వివరంగా చెప్పే సరికి వారూ అర్థం చేసుకున్నారు.

మా పెళ్ళి ఫిబ్రవరి 22, 1964న దివ్యంగా జరిగింది... ఐతే ఆ ఆకతాయి ఉత్తరాలు రాసిందెవరో అప్పటికీ,ఇప్పటికీ, ఎప్పటికీ మిస్టరీ గానే వుండి పోయింది.ఎవరో తప్పిపోయిన పెళ్ళికొడుకులు ఈ కొంటె పని చేసివుంటారని ఒక ఊహ మాత్రం మిగిలిపోయింది..! అదో విచిత్రమైన చేదు అనుభవం, పెళ్ళికి ముందు..!



పెళ్ళి అవగానే తిరుపతి కొన్నాళ్ళుండి, మళ్ళా నర్సాపూర్ వచ్చేసి మూడున్నర సంవత్సరాలు పుట్టింట్లోనే వున్నాను.. తరువాత 73- నుంచీ 75 వరకూ ఇరాన్ లోనూ, 75 నుంచీ అమెరికాలో నా నివాసం..! దాదాపు నలభైరెండేళ్ళ తరువాత మా పెళ్ళి రోజుని జ్ఞాపకం చేసుకునే అవకాశాన్నిచ్చిన సుజనరంజని కి కృతజ్ఞతలు తెలియ చేస్తున్నాను..

వేదాల రంగనాథం



మా స్వగ్రామం నర్సపూర్‌కి 7 మైళ్ళ దూరంలో వున్న మత్స్యపురి. నాన్నగారు వ్యవసాయం చేస్తూనే ధాన్యం కమిషన్ వ్యాపారం కూడా

చేస్తుండేవారు. మేము మొత్తం 8 మందిమి సంతానం.. ఏడుగురు అన్నదమ్ములం, ఒక చెల్లి... నేను ఐదవ వాడిని. నర్సపూర్ లో 55 లో ఇంటర్మీడియట్ , ఒక సంవత్సరం బి.ఎస్సీ చదివాక వైజాగ్ లో ఎం.బి.బి.ఎస్ పూర్తి చేసి, ఉస్మానియా యూనివర్సిటీలో హౌస్ సర్జన్‌లో చేరాను.

సాధారణంగా మా ఇంట్లో 23-24 ఏళ్ళకే అందరికీ పెండ్లిండ్లు చేసే అలవాటు. ఆ విధంగానే నాకూ 24 ఏళ్ళు రాగానే నాన్నగారి పెళ్ళి సంబంధాలు చూడడం మొదలు పెట్టారు. నాన్న గారంటే గౌరవం, భక్తి తోబాటూ భయం కూడా ఎక్కువగానే ఉండేది. ఆయన ముందు తలెత్తి కూడా చూసేవాళ్ళం కాదు. ఎం.బి.బి.ఎస్ పూర్తి చేశాకే ఆయన ముందు ధైర్యంగా నిల్చోగలిగాను. ఒకటి , రెండు పెళ్ళి చూపులకి నాన్నా నేనూ ఇద్దరమే కలిసి వెళ్ళాం. ఎవరూ మమ్మల్నంతగా ఆకట్టుకో లేదు.. నా చదువు ధ్యాసలో నేను వుండి పోయాను..

అప్పటి వరంగల్ కలెక్టర్ గారికి మా అన్నయ్య ఒకరితో పరిచయం ఉండడం వల్ల, కలెక్టర్ గారి చెల్లెలు



ముత్యాల తలంబ్రాలలో

ఒకరు ఉన్నారనీ, చూసేందుకు రమ్మనీ అన్నయ్యతో కబురు పెట్టారు. మా ఇంట్లో కూడా ఈ విషయం తెలీదు.. అన్నయ్యా, నేనూ కలిసి వరంగల్ వెళ్ళాం..ఊహు.. సంబంధమూ నచ్చలేదు. ఇంటికి వచ్చేశాం..

నాన్నగారు నర్సపూర్ లో వున్న కృష్ణకుమారి గురించి చెప్పారు. తను మా ఇంకో అన్నయ్యకి స్టూడెంట్ కూడా. ఇద్దరూ నాకు ఆ అమ్మాయి గురించి చెప్పారు. వాళ్ళ నాన్న గారితో మాట్లాడి కృష్ణతో పెళ్ళి చూపులు ఏర్పాటు చేశారు. తీరా అక్కడికి వెళ్ళాక తెలిసింది, మేము వరంగల్ లో పెళ్ళి చూపులు చూసింది కృష్ణ వాళ్ళ అక్కయ్యనే నని..! ఏమైతేనేం కృష్ణ మా అందరికీ నచ్చింది. ఇలా పెద్దమ్మాయిని వద్దని



మనవళ్ళతో

చిన్నమ్మాయిని చేసుకోవడం మా కాబోయే మామగారికి నచ్చకపోయినా, నేను డాక్టర్‌ని కావడం వల్ల ఒప్పుకున్నారు.. ఐతే కృష్ణ తన కథనంలో రాసినట్లు వాళ్ళ అక్కయ్య పెళ్ళి అయ్యాకేమా పెళ్ళి అని ఒప్పందం..

నేను అప్పటికి హౌస్ సర్జన్ పూర్తి చేసి తిరుపతిలో జాబ్ లో చేరాను.. అదృష్టవశాత్తూ కృష్ణ వాళ్ళ అక్కయ్యకి కూడా త్వరలోనే సంబధం కుదరడం వల్ల, మా పెళ్ళీ 1964 ఫిబ్రవరిలో నిశ్చయమయ్యింది. ఐతే ఒక రోజు నా తిరుపతి ఎడ్రసుకి ఒక ఉత్తరం వచ్చింది.." మీరు కృష్ణకుమారిని పెళ్ళి చేసుకోవద్దు. చేసుకుంటే చాలా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.." ఇంకా ఏమిటేమిటో రాశారు.. నాకేమీ పాలు పోలేదు.. మా అన్నయ్య లందరికీ తెలిసిన బంధువుల్లోనే సంబంధాలు కుదిరాయి. నాకే ఇలా బయటి సంబంధం అనుకున్నారు.

నాకేం చెయ్యాలో పాలు పోలేదు.. పెళ్ళికి వెళ్ళడం మానేద్దామనుకుని రిజర్వ్ చేయించుకున్న టిక్కెట్టు కాన్సిల్ చేయించాను. మళ్ళీ 'అయ్యో.. ఆడపిల్ల జీవితంగదా..ఎవరో తెలీని ఆకతాయి ఉత్తరం చదివి ఇలా చేయడం భావ్యమా.. ' అని ఆలోచించి మళ్ళీ టిక్కెట్టు కొన్నాను..ఇలా నేను సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతుండగా, నర్సపూర్ నుంచీ అన్నయ్య వచ్చాడు, అలాంటివే మరో రెండు ఉత్తరాలు చేత్తో పట్టుకుని. తనే చెప్పాడు.."వీటిని సీరియస్‌గా తీసుకోకు.. ఎవరో గిట్టని వాళ్ళు చేసిన ఆకతాయి పని. మేము వెళ్ళి వాళ్ళతో మాట్లాడి వచ్చాము. వాళ్ళకీ మనగురించి చెడ్డగా రాశారట.. వీటిని పూర్తిగా మర్చిపోవాలి మనం" అని.

అప్పటికి నా మనసు స్తిమిత పడింది... పెళ్ళిరేపనగా ఒకరోజు ముందే ఊళ్ళో అడుగుపెట్టాను. అనుకున్న ముహూర్తానికే మాపెళ్ళి శుభప్రదంగా జరిగి కృష్ణకుమారి శ్రీమతిగా నా జీవితంలోకి అడుగుపెట్టింది. ఒక్కసారి వెన్నకి తిరిగి చూసుకుంటే జీవితం ఎంత విచిత్రమో అనిపిస్తుంది.. పెళ్ళిళ్ళు పైలోకంలోనే రాసి పెట్టి ఉంటాయనడానికి ఇది ఒక ఉదాహరణేమో..! యాభై రెండేండ్ల వైవాహిక జీవితంలో మా ఇద్దరిదీ ఒకే మాట..ఒకే అడుగు..!

❀❀❀❀❀



ఇప్పటి మా కాలక్షేపం

వేదాల రంగనాథం గారు ఇండియానా లోని టెర్రాహట్ లో పేరొందిన రేడియాలజిస్ట్.. రంగనాథంగారూ,కృష్ణకుమారిగారూ..ఇరువురూ పలు స్వచ్ఛంధ సంస్థలను నిర్వహించారు. స్థానిక ఇండియన్ అసోసియేషన్‌కీ, తెలుగు అసోసియేషన్‌కీ కూడా సారధ్యం వహించారు.. ఇంకా ఆ సంస్థలలో కీలకమైన పాత్ర వహిస్తున్నారు. వీరికి ఇద్దరు అబ్బాయిలు శ్రీనివాస్, గిరిధర్. ఒకరు ఇంజినీర్ గానూ, మరొకరు కార్డియాలజిస్ట్‌గానూ స్థిరపడ్డారు. కోడళ్ళు వసుంధర, మైధిలి, మనవళ్ళు శ్రీకర్, శ్రీవత్స, విష్ణు, వరుణ్. టెర్రాహట్ వెళ్ళిన తెలుగు వారికెవరికైనా వారిల్లు స్వాగతం పలుకుతుంది